

కథా కౌముది

# అలా పారిపోతారేం?

చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి

**"ఆమె సొగసైనదే, మనసైనది కాదు,** అవును నిజం. కనుముక్కు తీరు, కళ్ళు తిప్పుకోనివ్వదు. కానీ ఆ మాట తీరే" ఇలా సాగుతున్నాయి ఆలోచనలు. వాళ్ళిద్దరూ కొట్టుకోవడం, కలిపోవడం మామూలే.

కానీ ఈసారి మాత్రం విషయం గంభీరంగా వున్నట్టుంది, పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. వాళ్ళ జీవన ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు.

`కోపం` మానవ సహజం. అది ఒక బలహీనత.

`ఆవేశం` కోపానికి తరువాత స్థాయి. `అసమర్ధత` `ఆవేశానికి తోడైతే `ఆక్రోశం`, ఆశక్తత మనిషిని బలహీనం చేస్తుంది. అట్లాంటప్పుడే ఆక్రోశాన్ని వికృతిగా "బక్కకోపం" అని పిలవొచ్చు ఇప్పుడు మన కథానాయకుని పరిస్థితి అదే

"రోజూ మీకు సేవలు చేస్తూ జీవితం గడుపుతున్నా. నన్ను నేను అర్పించుకుంటూ కొవ్వొత్తి లాగా కాలిపోతున్న నా అందమే నాకు శాపమా? ఎవడో ఏదో అన్నాడని మొఖం మీద గాట్లు పెట్టుకుని తిరగాలా? నీకోసం నేను ఎంత చేస్తున్నాను అది గమనించవా?" ఇది మన కథానాయకి అంతరంగం.

సమాజం వాళ్ళిద్దరినీ, భార్యాభర్తలుగా కట్టేసింది. "అసలు తప్పు అదే" ఇద్దరూ ఏక కంఠంతో.

"బాగానే వుంది సంబరం, ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టూ నా పెళ్ళాం, నా మొగుడూ అని పూసుకు పూసుకు తిరిగి, మాది స్వచ్ఛమైన ప్రేమ అని, అందమైన ప్రేమ అని నిఖార్సైన ప్రేమ అని పళ్ళు ఇకిలించి ఒకళ్ళ కళ్ళల్లో ఒకళ్ళు చూసుకుంటూ మైమరచిపోతిరి, కాస్త ఈ లోకంలోకి రండర్రా అంటే ఛీ, పో మీ లోకంతో మాకు పనేంటి అని ఒకళ్ళనొకళ్ళు అతుక్కుపోతిరి. మమ్మల్ని ఎవ్వరూ విడదీయలేరని తెగ నీల్గిరి. ఇప్పుడు మా మీద పడిపోతారేం?" ఇది మధ్యవర్తుల ఆవేదన.

ప్రతీ సమస్యకి ఒక పరిష్కారం వుండాలికదా? అందుకనే మీరు నేను కలిసి టీవీలో ప్రోగ్రామ్‌లు పెట్టి అయినా ఈ సమస్యని పరిష్కరించాలి ఏమంటారు? అసలు జరిగిందేమిటో తెలియాలి అంటే విషయాన్ని మొట్టమొదటినుంచి తెలుసుకోవాలి. రింగులు, రింగులు తిప్పి మిమ్మల్ని గతంలోకి తీసుకెళ్ళాల్సిందే రెడీనా? డొయ్...డొయ్...డొయ్.. అదిగో వచ్చేశాం చూశారా. అదిగో ఆ పార్క్‌లో ఆ మూల చూశారా గిరిజాల జుట్టు, బెల్‌బాటం ప్యాంట్, పెద్ద కాలర్ షర్ట్ పూల పూలది చూశారా? చేతిలో సిగరెట్. ఆ సొగ్గాడే మన

కథానాయకుడు. ఆ పక్కనే కుదురుగ్గా కూర్చుని వుండే ముద్దమందారం.. ఆవిడే మన కథానాయకి. వారేదో విషయం గురించి తీవ్రంగా చర్చించుకుంటున్నారు. వినండి. కొంచెం ఇసింటా జరగండి. వినిపిస్తోందా?

"అదికాదు సుశీ ఇట్లా ఎన్ని రోజులు? నిన్ను విడచి నేను వుండలేను నీకు తెలుసుకదా?"

"అవుననుకో మోహన్ నా పరిస్థితి నువ్వు అర్థం చేసుకో"

"పోనీ.. నేను మీ వాళ్ళతో మాట్లాడతాను."

"ఎందుకో భయంగా వుంది మోహన్."

"భయమెందుకే పిచ్చిదానా.. నా గుండెల్లో నిన్ను దాచిపెట్టుకోనా? నా కళ్ళల్లో నిన్ను నింపుకుని నీతోనే నా జీవితం."

"మోహన్ చాలు ఈ జీవితం నీది. నేను నీదాన్ని."

"సుశీ.. నేను నిన్ను ప్రేమిస్తున్నాను నువ్వులేక పోతే నేను లేను"

"మోహన్ అలా చూడకు నీ చూపులతో తడిసిపోయి ముద్దయి కరిగిపోతున్నా. నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను"

"సుశీ.."

"మోహన్.."

గురుగారూ, చాలు. ఇక చాలు మీరు కొంచెం వాళ్ళనుంచి దృష్టి నావైపు తిప్పండి. ఇక సెన్సార్ వారు ఒప్పుకోరు. మీకు విషయం అర్థం అయిందిగా? ఈడు, జోడు బాగున్నారు, పైగా ప్రేమించుకున్నారు, సమాజం కూడా హర్షించింది. అదృష్టవశాత్తూ, ఒకే కులం, ఒకే స్థాయి. ఇక అడ్డేముంది? ఫెళ్ళున పెళ్ళైంది. మూడు ముళ్ళు ఆరు చదివింపులు, ప్రేమయాత్రలు, తీపి గుర్తులు, ఓహ్.. ఇక చెప్పనవసరంలేదు అన్నీ యధావిధిగా జరిగినాయి పదహార్రోజుల పండగంత ఉత్సాహంగా సంవత్సరీకం కూడా జరిగింది.

నిజమే. మీరు ఊహించిన దాంట్లో తప్పేం లేదు. సమాజంలో జరుగుతున్న ఎన్నో సంఘటనలు చూసి, చూసి మీరూ అలాగే అనుకున్నారు, తప్పులేదు సంవత్సరం వరకూ బాగానే వున్నారు అని అనుకున్నాడు సాధారణంగా. అలాగే జరగాలి. ముఖ్యంగా వాళ్ళ మధ్య గొడవలకి కారణం వాళ్ళ కుటుంబ సభ్యులే అయివుండాలి. ఎందుకంటే ఇంత అన్యోన్యంగా వున్న భార్యాభర్తలని చూస్తే అందరికీ కుళ్ళే. షరా మామూలుగానే చుట్టూ వున్న వాళ్ళే. ఏదొక చెత్తపని చేసుంటారు. అనీ. మీలాగే నేను కూడా తడుముకున్నా. అలా అనుకోవటం సుతరామూ తప్పుకాదు. ఎందుకంటే ఎక్కడ చూసినా ఇవే లుకలుకలు. ఏ కుటుంబంలోనైనా సరే. అది అతి సామాన్యమైన విషయం.

కానీ వీళ్ళు కథానాయక, నాయకిలు కాబట్టి వీళ్ళ విషయం అంత సామాన్యంగా ఎందుకుంటుంది? అంత సామాన్యమైతే నేను మీరు మధ్యవర్తులుగా ఎందుకు వస్తాం? పెద్ద విషయం వుంది. అంత తీవ్రమైన విషయం కాబట్టే ఇన్నేళ్ళ తరువాత ఇపుడు ఇంత గొడవ జరిగింది.

ఆఁ మనం ఎక్కడిదాకా వచ్చాం? ఆఁ సంవత్సరీకం పదహార్రోజులంత వుత్సాహంగా జరిగింది అని చెప్పానుకదా, అలా ప్రతిసంవత్సరమూ అంతే వుత్సాహంగా. ముప్పైఏళ్ళు గడిచాయి. అయితే ఇన్నేళ్ళు అన్యోన్యంగానే వున్నారు. ఏ పొరపొచ్చాలు లేవు అని మాత్రం నేను చెప్పలేను. మానవమాత్రులం కనుక మరీ నిత్యమూ కాకపోయినా నెలకొకసారి, ఆరునెలలకొకసారి, కొండకచో సంవత్సరానికి ఒకసారి గొడవలు పడి విడిపోతారేమో అన్నంత పరిస్థితికి విషయం వచ్చింది. ఏదో మీలాంటి నాలాంటి మధ్యవర్తులు వుండి విషయాన్ని సర్దేశారు. అయితే ఈ మధ్యలో జరిగిన ఒక సంఘటన, వాళ్ళ జీవితాల మీద ఇంత ప్రభావం చూపుతుందని ఎన్నడూ అనుకోలేదు. ముప్పై ఏళ్ళ కాపురాన్ని అతలాకుతలం చేస్తుందని మనమెవ్వరమూ వూహించలేము. అంతెందుకు, సృష్టికర్త బ్రహ్మే కనిపెట్టలేకపోయాడు. ఇప్పటికీ తన నాలుగు జుట్లూ పీక్కొని నాలిక్కర్చుకుంటూనే వున్నాడు, సరస్వతమ్మ ఇంకా ముక్కు ఎగబీలుస్తూనే వుంది. సకల చరాచర జగత్తుని సృజియించి, సృష్టించి, నియమించి ఎనభైనాలుగో అంతకన్నా ఎక్కువో కోట్ల జీవరాశులని వాటి

నుదిటిరాతని ఇంత అమోఘంగా రాస్తున్న బ్రహ్మ. ఇంత తప్పిదం ఎందుకు చేశాడో, ఏ ఏమరిపాటున ఇంత చిన్న తప్పు జరిగిందో తెలీలేదు. సప్తర్షులు వాళ్ళ ఆవిళ్ళు కూడా వర్గాలుగా మారిపోయారు వాళ్ళ వాళ్ళ పక్షాలను సమర్ధిస్తూ చీలిపోయారు. పెద్దలు వశిష్ఠులవారు, విశ్వామిత్రులవారు అరుంధతమ్మ, అనసూయమ్మ, లాంటి వారు తమ తమ అనుభవాలను బట్టి విశ్లేషణ చేద్దామని పూనుకుని మళ్ళా ఏదో అత్యవసరమైన పనున్నట్టు కళ్ళు మూసుకుని జపం చేసుకుంటున్నారు. మొగుడు పెళ్ళాల మధ్య వ్యవహారంలోకి దూరకూడదన్న వైదిక సత్యాన్ని ఆపోసన పట్టేశారు. బాధ్యత లేని వారు కాబట్టి. వాళ్ళు అట్లా వెళ్ళిపోయినా కుదురుతుంది. మీకు నాకు ఎట్లా కుదురుతుంది? మనం ఇప్పుడు తరతరాల మూఢాచారాన్ని పారద్రోలి ప్రపంచశాంతి నెలకొల్పాలి ఏమంటారు?

సరే. సరే. అసలు విషయానికి వస్తాను. ఆ రోజు ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? లింగవివక్ష లేకుండా వున్నది వున్నట్టు మీకు చెబుతాను. ఆ తర్వాత మనిద్దరం కూర్చుని తప్పొప్పులు నిర్ణయించి తప్పు చేసిన వాళ్ళని శిక్షించాలి. సరేనా మళ్ళా రింగ్.. రింగ్.. డొయ్ఁ.. డొయ్ఁ.. సరిగ్గా వారం రోజుల క్రితం ఓ ఆదివారం రోజులాగే ఆరోజూ తెల్లారింది, కోడికూసింది. (అంటే అలారం లేదా, పాలవాడు కొట్టిన బెల్. అని మీరు అన్వయించుకోవచ్చు). బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ వూరు లేచింది. ఊరితోపాటూ వాళ్ళూ లేచారు. దంతధావన, ముఖప్రక్షాళనలాంటి అత్యవసర కార్యక్రమాలు ముగించుకుని కాఫీలు తాగి టిఫినీలు తిని బ్రేవ్ మని తేల్చి తేలికపడ్డారు. గాలి మందంగా వీస్తోంది. గోడమీద కాకి కావు కావు మని జరగబోయే అనర్ధం గురించి హెచ్చరించింది. క్షణం ఒక యుగంగా విసుగ్గా నడుస్తున్న ఘడియలు.

అద్దంతో చూసుకుంటూ సుశీల అడిగింది.

"మోహన్ నేను అందగత్తెనేనా?"

యధాలాపంగా దాడిని గమనించని వీరసైనికుడు బదులిచ్చాడు.

"ఆ సందేహం ఎందుకు వచ్చింది సుశీ?"

"నిన్న కూరలు కొనటానికి వెళితే ఆ వీధి చివర షాప్‌లో ఎవరో ఇద్దరు కుర్రాళ్ళు కత్తిలాగుందిరా అని అన్నారు. నన్నే అన్నారంటావా లేక ఇంకెవర్నైనా అన్నారా?"

"అక్కడ నువ్వుకాక ఇంకెవరైనా వున్నారా?"

"ఉన్నారు. షాప్ అతను ఎదురిటి తాతగారు"

"ఆడవాళ్ళు ఎవరైనా వున్నారా?"

"లేరనుకుంటా.. ఏమో నేను గమనించలేదు.."

"లేరనుకుంటా ఏమిటి? అట్లా వాగినప్పుడు నిన్నే అనిపిస్తే వెధవలని చీవాట్లు పెట్టి చెప్పుతో రెండేసి రావల్సింది.."

"కుర్రాళ్ళు మోహన్ చిన్న పిల్లలు వాళ్ళు నన్నే అన్నారో లేదో అర్ధం కాలేదు."

"అక్కడేమో ఆడవాళ్ళు ఎవ్వరూ లేరూ అంటుంటివి. నువ్వు ఒక్కదానివే వున్నావు. అంటుంటువి అట్లాంటప్పుడు వాళ్ళు నిన్ను కాక ఎవరిని అన్నట్టూ?"

"అదిగో అదే ఆ ఆవేశమే వద్దు. నేను ఆడవాళ్ళెవరైనా వున్నారో లేదో గమనించలేదా అని చెబుతున్నానా?"

"ఆహఁ.. మగవాళ్ళెవరున్నారా. మాత్రం గమనించావా?"

"మోహన్ నువ్వు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నావు."

"సుశీ.. ఏడవకు. పోన్లే నేనే తప్పుగా మాట్లాడాను నన్ను క్షమించు."

ఊపిరి భారమైంది.

"అంతేలే మీ మొగాళ్ళంతా ఇంతే. నిన్ను కన్నవాళ్ళననాలి. అసలు మీరు నన్నెప్పుడు అర్థం చేసుకున్నారని?"

కళ్ళు ఎర్రబడ్డాయి

"ఈ చర్చలోకి మావాళ్ళెందుకు వచ్చారు?" చెంగుబిగించి "ఏం మీ అమ్మనంటే అంత పొడుచుకొచ్చిందేం? ఏం పదహార్రోజుల పండగనాడు మీ పిన్నమ్మతో మీ అమ్మ ఏమందో గుర్తులేదా?"

కళవళపడి "ఏ విషయం? ఏమంది?"

ఆవేశం "ఆహా! అప్పుడే మర్చిపోయారన్నమాట నా..నా.. అనుకుని వినోద్‌ని కాదని మిమ్మల్ని కట్టుకున్నాచూడు."

"వినోద్‌గాడి గురించి ఇప్పుడు ఎందుకు? ఆ వెధవ గురించి నా దగ్గర మాట్లాడకు."

"ఏం? ఎందుకు మాట్లడకూడదు? ఇప్పుడు నేను వినోద్ గాడి గురించే మాట్లాడతాను ఏం చేస్తారు?"

"సుశీ.. నువ్వు నా సహనాన్ని పరీక్షిస్తున్నావు.."

"అబ్బో సహనం పెళ్ళాం అందాన్ని పొగడలేరుగానీ ఎవరో కుర్రాళ్ళు పొగిడేసరికి పొడుచుకొచ్చింది."

"అసలు విషయం ఏంటీ, నువ్వు వాదిస్తున్నదేమిటి?"

"ఇవన్నీకాదు నేను సూటిగా అడుగుతా.. చెప్పండి"

"అడుగు."

ఇదిగో మాష్టారు మీరు అట్లా పారిపోతే ఎట్లా? మనల్ని మధ్యవర్తులుగా చేసి బాధ్యత మనకిచ్చారు. మనం ఎలాగోలా. ఈ సమస్యకి పరిష్కారం చెప్పాలి. భారతీయ కుటుంబవ్యవస్థని కాపాడాలి. ఇదిగో వినండి వినమంటుంటే మాష్టారూ అట్లా వెళ్ళిపోతారేం?

Post your comments